

బార్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి

పార్వతీపురం, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన బార్ పాలసీకి అనుగుణంగా శనివారం కలెక్టరేట్‌లో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఓపెన్ క్యాటగిరీ, గీత కార్మికులకు బార్లు కేటాయించారు. నాలుగు బార్లకు సంబంధించి తొలుత కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాటరీ తీశారు. జిల్లాలో ఓపెన్ కేటగిరీలో తొమ్మిది, గీత కార్మికులకు సంబంధించి పది అప్లికేషన్లు స్వీకరించామని, మొత్తంగా రూ.96.90 లక్షల ఆదాయం వచ్చిందని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు తెలిపారు. వీరికి సెప్టెంబరు 1 నుంచి బార్‌లు కేటాయిస్తామన్నారు.

- మన్యంలో పారిశ్రామిక అభివృద్ధి దిశగా అడుగులు పడని వైనం
- ప్రకటనలకే పరిమితమైన గత వైసీపీ సర్కారు
- నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి
- జిల్లావాసుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఇప్పటికే పాలకొండలో స్థలం ఖరారు
- మిగిలిన మూడుచోట్ల ఖరారు కాని పరిస్థితి
- దీనిపై దృష్టి సారించాలని విన్నపం


పనుకువలసలో ఎంఎస్ఎంఈ పార్క్‌కు కేటాయించిన స్థలం ఇలా..

ఏదీ పారిశ్రామికీకరణ?



స్థలాలు ఖరారు కాలేదు

జిల్లాలో పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు స్థలం ఖరారైంది. ఆ ప్రాంతంలో రోడ్లు, కాలువలు నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. 27 ఎకరాల్లో సుమారు రూ.7 కోట్లతో పార్క్ పనులకు శ్రీకారం చుట్టాం. ఇక సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు స్థలాలు ఖరారు కాలేదు.

- కరుణాకర్‌రావు, జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి మేనేజర్, పార్వతీపురం మన్యం

స్వీట్‌షాప్‌లో పనిచేస్తున్నా..

నేను ఐటీఐ చదివాను. జిల్లాలో ఎటువంటి పరిశ్రమలు లేకపోవడం వల్ల స్వీట్ దుకాణంలో పనిచేస్తున్నా. గతంలో ఒకసారి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా విశాఖ వెళ్లాను. కానీ అక్కడ భోజనం, వసతి సక్రమంగా లేదు. జీతాలు కూడా వస్తాయో లేదోనన్న సందేహంతో నా స్నేహితుడితో కలిసి తిరిగి పార్వతీపురం వచ్చేశా.

- తేజ, పార్వతీపురం

పార్వతీపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లాగా ఆవిర్భవించకముందు.. ఆ తర్వాత కూడా అదే పరిస్థితి. ఇక్కడ చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటీ లేదు. వైసీపీ హయాంలో పారిశ్రామికీకరణ దిశగా అడుగులు పడలేదు. దీంతో స్థానికంగా ఉపాధి దొరక్క ఈ ప్రాంతవాసులు పొట్ట చేతబట్టుకుని వలస బాట పడుతున్నారు. పనుల కోసం కుటుంబాలను వదిలి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు పయనమవు తున్నారు.

మహానగరాల్లో చాలీచాలని జీతాలతో బతకలేక.. తిరిగి స్వగ్రామాలకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్న నాటి వైసీపీ ప్రభుత్వ హామీ గాలిలో కలిసిపోయింది. పాచిపెంట మండలంలో ఇండస్ట్రీయల్ ఏరియా ఏర్పాటు చేస్తామన్న గత వైసీపీ పాలకులు ప్రకటనలకే పరిమితమయ్యారు. కనీసం స్థలాన్ని కూడా ఖరారు చేయలేకపోయారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌లు ఏర్పాటు చేసి.. ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ఇటీవల మరోసారి ప్రకటించడంతో జిల్లా నిరుద్యోగ యువత రాష్ట్ర సర్కారుపై కొండంత ఆశలు పెట్టుకున్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పొరుగు రాష్ట్రాలకు పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదని జిల్లా యువత అభిప్రాయపడుతోంది. అయితే జిల్లాలో పరిస్థితి

(మిగతా 8వ పేజీలో...)

స్థానికంగా ఉపాధి కల్పించాలి

ఇతర జిల్లాల్లో కంటే స్థానికంగా మాకు ఉపాధి కల్పించాలి. దీనివల్ల తల్లిదండ్రులను చూసుకునే వీలు కలుగుతుంది. ప్రైవేట్ ఉద్యోగాల్లో వచ్చే జీతాలతో ఇతర ప్రాంతాల్లో బతకడం కష్టం.

- రామారావు, పార్వతీపురం

సంచారమే.. 6లో

సంక్షేమం లేదు

- పౌరసేవలు, పథకాలు అందని ద్రాక్ష
- ప్రభుత్వ గుర్తింపు ఉండదు
- సంచార జీవుల ఆవేదన ఇది
- నేడు సంచార జాతుల దినోత్సవం



సర్టిఫికెట్లు తీసుకుని 7లో

తిరిగి వెళుతూ..

- రోడ్డు ప్రమాదం
- యువకుడికి బ్రెయిన్ డెడ్

దశలవారీగా సూపర్ సిక్స్ 8లో

పథకాల అమలు

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

వినాయకుడికి 108 రకాల నైవేద్యం 6లో

206 ఫోన్ల రికవరీ

- బాధితులకు అందజేసిన ఎస్పీ


బాధితుడికి ఫోన్ అందిస్తున్న ఎస్పీ

బెలగాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న, చోరీ అయిన 206 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'మొబైల్ రికవరీ మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రస్తుత కాలంలో సమాచారం చేరవేయడానికి, వినోదం, విజ్ఞానానికి, ఇతర అత్యవసర సమయాల్లో స్మార్ట్ ఫోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే ప్రజలు తమ ఫోన్లు పోగొట్టుకోవడం లేదా అపహరణకు గురైతే.. వాటిల్లో ఉండే వ్యక్తిగత, బ్యాంక్, ఇతర వివరాలు దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బాధితుల కోసం కేంద్ర ప్రభుత్వం మొబైల్ మిస్సింగ్ రిపోర్టింగ్ పోర్టల్ సీఈఐఆర్ (డబ్ల్యూడబ్ల్యూ. సీఈఐఆర్.జీవోవీ.ఇన్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో ఫోన్ వివరాలు నమోదు చేయాలి. ఈ విధంగా ఫిర్యాదు చేస్తే.. ఐఎంఈఐ నెంబర్ ద్వారా ట్రాకింగ్ చేసి మొబైల్స్‌ను రికవరీ చేసే అవకాశం ఉంటుంది. దొరికిన లేదా రశీదులు లేని మొబైల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కొనడం మంచిది కాదు.' అని తెలిపారు. ఎవరికైనా మొబైల్ దొరికితే వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. గత ఆరు నెలల్లో జిల్లాలో పోయిన సుమారు రూ.42 లక్షల విలువ గల 206 మొబైల్స్ రికవరీ చేసి బాధితులకు అందజేశామని వెల్లడించారు.

స్టేషన్ల వారీగా ఇలా..

బలిజిపేట-1, దోనుబాయి-6, ఎల్విన్‌పేట-02, కురుపాం-4,

(మిగతా 8వ పేజీలో...)

రాత్రి అయితే రెఫరే!

- ఇది పాలకొండ ఏరియా ఆసుపత్రిలో పరిస్థితి
- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- రోగులకు పూర్తిస్థాయిలో అందని వైద్యసేవలు


పాలకొండ ఏరియా ఆసుపత్రి

పాలకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రం పాలకొండ ఏరియా ఆసుపత్రి ద్వారా రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే వారికి వైద్యం అందడం గగనమవుతోంది. అత్యవసర వేళల్లో పొరుగు జిల్లాకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. మరోవైపు రాత్రి వేళల్లో వచ్చే కేసులను అత్యధికంగా రెఫరల్ చేస్తుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

పాలకొండ ఏరియా ఆసుపత్రి ఏజెన్సీకి ముఖద్వారంగా ఉంది. మైదాన, గిరిజన ప్రాంతాల నుంచి నిత్యం రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ, సరుబుజ్జిలి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల నుంచి కూడా రోగులు ఇక్కడకి వస్తుంటారు. విజయనగరం జిల్లాలోని రేగిడి ఆమదాలవలస, వంగర, మండలాల వాసులు, మన్యం జిల్లా పరిధిలోని పాలకొండ, ఏజెన్సీ ప్రాంతమైన సీతంపేట, భామినితో పాటు వీరఘట్టం, జియ్యమ్మవలస తదితర మండలాల ప్రజలు ఈ వంద పడకల ఆసుపత్రినే ఆశ్రయిస్తారు. మూడు జిల్లాల ప్రజలకు పాలకొండ ఏరియా ఆసుపత్రి పెద్దదిక్కుగా ఉన్నప్పటికీ.. రోగులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. రోజూ ఇక్కడకు వచ్చే రోగుల సంఖ్య 400 నుంచి 500 వరకు ఉంటుంది. ఇన్‌పేషెంట్లుగా ఉండేవారి సంఖ్య 80 నుంచి వంద వరకు ఉంటుంది. వీరికి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. ఓ వైపు వైద్యుల కొరత వేధిస్తుండగా.. చిన్నపాటి రోగానికి కూడా ఆసుపత్రికి వచ్చే వారికి భరోసా ఇవ్వకుండా శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేస్తుండడం పరిపాటిగా మారింది. ఇదిలా ఉండగా కొంతమంది వైద్యులు ఓపీ మధ్యలోనే ప్రైవేట్ క్లినిక్‌లకు పరుగులు తీస్తున్నారనే విమర్శలున్నాయి. వీటన్నింటిపై పర్యవేక్షించేవారే కరువయ్యారు. మరోవైపు రోగులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం, విశాఖపట్నం పరుగులు తీయాల్సి వస్తోంది. కొంతమంది

(మిగతా 8వ పేజీలో...)

రేపటి నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు 6లో

గిరిజనాభివృద్ధి కోసం ఎంవోయూ 7లో

జంఝావతి నిర్మాణానికి సహకరించండి

- ఒడిశా సీఎంను కోరిన ఎమ్మెల్యే విజయచంద్ర


ఒడిశా సీఎంతో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా వాసులు, రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న జంఝావతి ప్రాజెక్టు నిర్మా ణానికి ఒడిశా ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని ఎమ్మెల్యే విజయంద్ర ఒడిశా సీఎంను కోరారు. భువనేశ్వర్‌లో జరుగుతున్న లోక్‌సభ, వివిధ రాష్ట్రా శాసనసభ ఎస్టీ, ఎస్టీ సంక్షేమ కమిటీ ప్రతినిధుల జాతీయ సదస్సుకు ఏపీ తరఫున ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఒడిశా సీఎం మోహన్‌చరణ మాఝీని కలిశారు. మన్యం జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టు గత ఐదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై చొరవ చూపాలని కోరారు. ఇదిలా ఉండగా రెండు రోజుల జాతీయ సదస్సు ముగిసింది. అత్యంత వెనుకబడిన వర్గాల అభ్యు న్నతికి సమష్టిగా కృషి చేద్దామని ఎస్టీ, ఎస్సీ సంక్షేమ కమిటీ ప్రతి నిధులు తీర్మా నించారు. అనంతరం ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆహ్వానం మేరకు ఏపీ ప్రతినిధులు మధ్యాహ్న విందుకు హాజరయ్యారు.

పక్కాగా రేషన్ పంపిణీ

- అవకతవకలకు పాల్పడితే చర్యలు
- సబ్ కలెక్టర్ వైశాలి

మక్కువ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి హెచ్చరించారు. మక్కువ ఎంఎల్ఎస్ పాయింట్‌ను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్డుదారులకు సక్రమంగా రేషన్ అందించాలన్నారు. రికార్డుల నిర్వహణ పక్కగా ఉండాలని ఆదేశించారు. కార్డుదారులకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. నిర్ణీత సమయం కంటే ముందుగానే డిపోలకు రేషన్‌ను అందజేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. అనంతరం రికార్డులు, సరుకుల వివరాలను నిశితంగా పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ కె.భరత్‌కుమార్ , సివిల్ సప్లైస్ డీటీ వై.హేమంత్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆనంద సమయం.. 6లో

అప్రమత్తతే ముఖ్యం

- గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రారంభం
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదం

సారాను అరికడదాం: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నాటుసారాను అరికట్టి కుటుంబాలను కాపాడు కుందామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణపై శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సారాతో ఎంతోమంది అనారోగ్యం బారిన పడుతున్నారు. పనిచేసే శక్తి లేకవ డంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అవుతున్నాయి. లక్షల్లో ఖర్చు చేస్తున్నా ఆరోగ్యం మెరుగు కాక మృత్యువాత పడుతున్నారు. ఈ క్రమంలో ఆ కుటుంబాల్లో చిన్నారుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి సారాకు దూరం చేయాలి. జీవనోపాధుల కల్పనకు చర్యలు తీసుకోవాలి. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారిని కఠినంగా శిక్షించాలి. అటవీ ప్రాంతం గుండా బస్సులు, ఇతర వాహనాల ద్వారా జరిగే మత్తు పదార్థాల రవాణాను కట్టడి చేయాలి. వాటి వల్ల కలిగే అనర్థాలపై విద్యా సంస్థల్లో అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలి.' అని తెలిపారు. అనంతరం పోలీస్‌శాఖ ద్వారా చేపట్టిన చర్యలను ఎస్పీ మాధవరెడ్డి వివరించారు.

నత్తల నివారణకు చర్యలు

నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆశించి విపరీతమైన నష్టం కలిగిస్తున్న ఆఫ్రికన్ నత్తలను నిర్మూలించే పద్ధతులపై రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. కొమరాడ మండలం గంగరేగువలసలో బొప్పాయి, జామ, పత్తి పంటల సంరక్ష ణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌కు సర్వే


ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌కు సర్వే చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పరి శ్రమల పురోగతి, ఎగుమతుల మండలి (డీఐపీఈసీ), ఈవోడీబీ ఔట్ రీచ్ వర్క్‌షాప్‌ను కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, పారిశ్రామికవేత్తలతో ఆయన మాట్లాడుతూ... ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్ అనేది ఆయా ప్రాంతాల వార్షిక వ్యాపార సౌలభ్యం సూచిక అన్నారు. ఇది పెట్టుబడులను ఆకర్షించడానికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం పారిశ్రామికవేత్తలు తాము పొందిన సేవలను తెలిపారు. ఈ సమా వేశంలో జిల్లా పరిశ్రమల , కార్మిక శాఖ అధికారులు కరుణాకర్, సువర్ణ, రాంబాబు, పరిశ్రమలశాఖ కన్సల్టెంట్ రాజా హర్ష, లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయస్వరూప్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ

పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాముకు వేసిన సీళ్లు, ఈవీఎంల రక్షణ భద్రతలకు సంబంధించి ఏర్పాట్లు పరిశీ లించారు. పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఆర్వో కె.హేమలత, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద సమయం.. అప్రమత్తతే ముఖ్యం

- ప్రారంభమైన గణేశ నిమజ్జన ఉత్సవాలు
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదం
- వర్షాలతో నిండుగా ఉన్న చెరువులు, నదులు



విజయనగరం క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): హిందువుల పండుగల్లో వినాయక నవరాత్రులకు ఉన్న ప్రత్యేకత వేరు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాల నడుమ వేడుకల్లో పాల్గొంటారు. ఈ వేడుకల్లో నిమజ్జన కార్యక్రమం మరింత ప్రత్యేకం. ఆ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా మరింత ఆనందాన్ని సొంతం చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామాలు, పట్టణాల్లో గణేశ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటిని మూడోరోజు నుంచి నిమజ్జనం చేస్తారు. ఎక్కువగా తొమ్మిదో రోజున నిమజ్జనం చేస్తారు. సెప్టెంబరు 7న చంద్రగ్రహణం ఉంది. కాబట్టి అంతకు ముందుగానే నిమజ్జనం చేయాల్సి ఉంది. ఎక్కువగా 3వ తేదీ నుంచి నిమజ్జనాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అర్ధరాత్రి వరకు ఊరేగించి సమీపంలోని చెరువులు, కాలువలు, నదుల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఈ సమయంలో ఎక్కువగా ప్రమాదాలు, వివాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కాబట్టి వీటికి తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తీరప్రాంత మండలాల్లోని సముద్రంలో గణనాథుల విగ్రహాల నిమజ్జనం జరుగుతుంది. ఆ సమయంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మూల్యం చెల్లించుకోక తప్పదు. ముఖ్యంగా చిన్నారుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల చెరువులు, నదులు నీటితో నిండుగా ఉన్నాయి. ఇలాంటిచోట్ల నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఈత తెలిసిన వారు మాత్రమే.. అదీ ఒడ్డున ఉంటూ కార్యక్రమం పూర్తి చేయాలి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చెరువులతో పాటు నదులు, కాలువలను నిమజ్జనాలకు ఎంచుకుంటారు. వీటిలో నీరు ప్రమాదకర స్థాయిలో ఉందనే విషయాన్ని గుర్తించాలి.
- ఉపాధి పనులు చేపట్టడం వల్ల చెరువులు లోతుగా ఉంటాయి. లోతు తెలియని వారు ఎటువంటి పరిస్థితుల్లోనూ చెరువుల్లో దిగరాదు. గుంతల్లో దిగితే మునిగిపోయే ప్రమాదం ఉంది.
- చాలామంది మద్యం తాగి ఊరేగింపులోకి వస్తుంటారు. అలాంటి వారిని వేడుకలకు దూరంగా ఉంచాలి. ఊరేగింపు సమయంలో రహదారులపై వాహనాల రాకపోకలను గమనించాలి. ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టించకూడదు.
- ఎత్తయిన విగ్రహాలను వాహనాల్లో తరలించే సమయంలో విద్యుత్ తీగలను గమనించాలి. గతంలో వీటి కారణంగా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.
- నిమజ్జనంలో అధిక శబ్దాలు వచ్చే డీజే వంటి బాక్సులను ఏర్పాటు చేయరాదు. పోలీసుల సూచనల మేరకు స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి.
- పోలీసులు సూచించిన మార్గంలోనే నిమజ్జన ఊరేగింపు ఉండాలి. గ్రామాల్లో ఐదారు విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. అన్ని విగ్రహాలను ఒకే రోజు.. ఒకే సమయంలో నిమజ్జనం చేయకుండా జాగ్రత్త పడాలి.
- నిమజ్జనం ఊరేగింపులో పాతకక్షలు ఉంటే బయట పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. ప్రత్యర్థులపై దాడులు చేసేందుకు కొందరు వేదికలుగా మలుచుకుంటారు. ఇలాంటి సంఘటనలకు అవకాశం లేకుండా కమిటీ సభ్యులు నిమజ్జన ఊరేగింపు సజావుగా సాగేలా చూసుకోవాలి.
- ఊరేగింపులో వేషధారణలపై ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- మద్యం, గంజాయి వంటివి తాగి నిమజ్జనాల్లో పాల్గొనే వారు ఇబ్బందులు సృష్టిస్తుంటారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- పోలీసులు గుర్తించిన సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలి.
- బాణసంచా పేల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రధాన రహదారులపై మందుగుండు పేల్చరాదు. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

పోలీసుల సూచనలు పాటించండి..



వినాయక నిమజ్జనోత్సవాలకు సంబంధించి పోలీసుల సూచనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలి. ఊరేగింపులో అశ్లీల నృత్యాలు, డీజేలకు అనుమతి లేదు. ఊరేగింపుల్లో బాణసంచా వినియోగించరాదు. మద్యం తాగే వారిని ఊరేగింపులకు దూరంగా ఉంచాలి. ఎటువంటి వివాదాలు లేకుండా చూడాలి. వివాదాలు తలెత్తితే నిర్వాహకులపె చర్యలు తప్పవు. నిమజ్జనోత్సవానికి పోలీసు శాఖ ఇచ్చే రూట్, సమయం తప్పనిసరిగా పాటించాలి. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, ఈత రాని వారిని చెరువులు, నదుల్లో దిగకుండా నిర్వాహకులే చూసుకోవాలి. వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో చెరువులు, నదులు, గెడ్డల్లో నీరు ఎక్కువగా ఉంది. దీనిని గమనించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

- వకుల్ జిందాల్, ఎస్పీ

అవి భద్రత కోసమే...

పోలీసు శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలి. భద్రత కోసమే అధికారులు, సిబ్బంది కొన్ని సూచనలు చెబుతారు. కొన్ని ఆంక్షలు విధిస్తారు. వాటిని తప్పనిసరిగా అనుసరించండి. ఫోటోలు, వీడియోలు తీసేటపుడు ఎదుటి వారికి ఇబ్బంది లేకుండా... నిమజ్జన ప్రక్రియకు ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోండి.

- వినాయక నిమజ్జనంలో డ్యాన్స్‌లు కీలక భూమిక పోషిస్తాయి. డీజేలాంటి సౌండ్ సిస్టమ్‌తో చిన్నారులు, పెద్దవారికి ఇబ్బందులు తప్పవు. వీటిపై పూజా కమిటీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. చిన్న పిల్లలను నీటి దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్త పడండి. అర్ధరాత్రి వరకు వేడుకల్లోనే ఉండిపోవద్దు. కాస్త ముందుగానే నిమజ్జనం పూర్తి చేసేందుకు ప్లాన్ చేసుకోండి. సంప్రదాయాలను గౌరవిస్తూ, నిబంధనలను పాటిస్తూ నిమజ్జనంలో పాల్గొంటే వేడుకను పూర్తిగా ఆస్వాదించగలరు. లేకుంటే విషాదం తప్పదు.

ఇంకా ఏం చేయాలంటే..

నిమజ్జన వేడుకల్లో పాల్గొనేవారు వీలైనంత వరకు తేలికపాటి దుస్తులు ధరించడం ఉత్తమం. వేడుకల్లో పాల్గొనేవారు తాగునీరు, స్నాక్స్ లాంటివి తీసుకెళ్లడం మంచిది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు ప్రతాపం చూపిస్తారు. అందుకే విలువైన వస్తువులు ధరించి నిమజ్జన వేడుకల్లో పాల్గొనవద్దు. తప్పనిసరిగా వేసుకోవాల్సిన వస్తువులుంటే తగిన జాగ్రత్తలు పాటించండి. ఫోన్లు లాంటివి బ్యాగులలో భద్రపరచడం మంచిది.

- నిమజ్జన సమయంలో పర్యావరణ కాలుష్యాన్ని వీలైనంత వరకు తగ్గించాలి. విగ్రహాలకు ఉండే అలంకరణ వస్తువులను నిమజ్జనానికి ముందు తొలగించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను నీటిలో వదలకూడదు. ఈ విషయంలో యువత చొరవ తీసుకోవాలి.

విజయవాడలో 'తూర్పు భాగవతం' ప్రదర్శన

బొబ్బిలి రూరల్/బొబ్బిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల దినోత్సవం నేపథ్యంలో శనివారం విజయవాడలో సంచార జాతుల 'స్ఫూర్తి మహాసభను నిర్వహించారు. ఆ సభలో బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన బొంతలకోటి శంకరరావు బృందం తూర్పు భాగవతాన్ని ప్రదర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ అధ్యక్షురాలు పురందేశ్వరి, బీసీ సంఘాల నేత కృష్ణయ్య, లక్ష్మణ్ తదితరులు ఆయనను అభినందించారు.



తూర్పు భాగవతం ప్రదర్శిస్తున్న శంకరరావు బృందం

రేపటి నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

విజయనగరం క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ, సివిల్ విభాగాల్లో కానిస్టేబుళ్లగా ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులకు సెప్టెంబరు 1 నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అభ్యర్థులు తమతో పాటు పాస్‌పోర్టుసైజ్ కలర్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా సూచించిన తేదీల్లో హాజరుకావాలన్నారు.

తేదీ	హాజరు కావలసిన ప్రాంతం	రిజిస్ట్రేషన్ నెంబర్లు	ఎంపికైన విభాగం
సెప్టెంబరు 1	పోలీసు పరేడ్ గ్రౌండ్, ఉదయం 7 గంటలకు	4013323 నుంచి 4175360వరకు	సివిల్ కానిస్టేబుళ్లు
		4177478 నుంచి 4232439	
2	పోలీసు పరేడ్ గ్రౌండ్, ఉదయం 7 గంటలకు	4234215 నుంచి 4347353	
		4350301 నుంచి 4495111	సివిల్ కానిస్టేబుళ్లు
		4001630 నుంచి 40444049	ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు
3	పోలీసు పరేడ్ గ్రౌండ్, ఉదయం 7 గంటలకు	4044111 నుంచి 4130825	ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు
		4132116 నుంచి 4189468	
4	పోలీసు పరేడ్ గ్రౌండ్, ఉదయం 7 గంటలకు	4190909 నుంచి 4235398	ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు
6	పోలీసు పరేడ్ గ్రౌండ్, ఉదయం 7 గంటలకు	4270844 నుంచి 40330310	
		4330524 నుంచి 4511514	ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు
		4235403 నుంచి 4269223	

వినాయకుడికి 108 రకాల నైవేద్యం



వినాయకునికి సమర్పించిన నైవేద్యం



పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 108 రకాల నైవేద్యాన్ని సమర్పించారు. 300 మంది మహిళా భక్తులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11,100 పసుపు కొమ్ములతో పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కూర్మనాథశర్మ, ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. నీలమ్మకాలనీ, టీచర్స్ కాలనీ, ఆంజనేయ కాలనీ, సాయిదుర్గానగర్ తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సంచారమే.. సంక్షేమం లేదు

- పౌరసేవలు, పథకాలు అందని ద్రాక్ష
- ప్రభుత్వ గుర్తింపు ఉండదు
- సంచార జీవుల ఆవేదన ఇది
- నేడు సంచార జాతుల దినోత్సవం

- రాజాం పట్టణానికి సమీపంలో కనిపించే సంచార జీవులు వీరు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వీరు గ్రామాల్లో గాడిద పాలు విక్రయిస్తుంటారు. కుటుంబాలతో వచ్చి ఇలా ప్రతి రోజూ ఒక ప్రాంతానికి వెళుతుంటారు. సాయంత్రం బస చేసిన చోటుకు చేరుకుంటారు. కొద్దిరోజుల పాటు ఇక్కడే ఉండి.. తరువాత చీపురుపల్లి చేరుకుంటామని వీరు చెబుతున్నారు.



- రాజాం పట్టణంలోని ఓ కార్పొరేట్ సంస్థలో జరిగిన సంక్రాంతి వేడుకలకు హాజరయ్యారు వీరు. ఏడాది పొడవునా గంగిరెద్దులతో ఊరూరా తిరుగుతూ యాచిస్తుంటారు. సంక్రాంతి సమయంలో మాత్రం సంబరాల పేరిట నిర్వహించే కార్యక్రమాలకు గంగిరెద్దులతో హాజరవుతుంటారు.



రాజాం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో సంచార జాతుల వారు కనిపిస్తుంటారు. ప్రధానంగా యాచక వృత్తిలో కొనసాగుతుంటారు. పనిముట్లు తయారు చేయడం, గాడిద పాలు విక్రయించడం, సర్కస్, చెత్త ఏరుకోవడం, తల జుత్తు కొనుగోలు చేయడం వంటివి వీరు చేస్తుంటారు. కొందరు ఒకవైపు పనిచేస్తూనే.. మరోవైపు యాచిస్తుంటారు. సంచార జీవనం గడిపే వీరికి ఆధార్, రేషన్ కార్డులతో పాటు బ్యాంక్ అకౌంట్లు లేకపోవడంతో ఎటువంటి సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు. ఇటీవల కాలంలో అనేక మంది సంచార జీవులు మారిన పరిస్థితులకు అనుగుణంగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. జిల్లాలో గంగిరెద్దుల వారితో పాటు కమ్మరి, ఉప్పర అని పిలిచే సంచార జీవుల వారు చాలాచోట్ల స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అటువంటి వారు సాధారణ పౌరుల్లా అన్ని సంక్షేమ పథకాలు అనుభవిస్తున్నారు.

అత్యంత వెనుకబడిన కులాలు

యాచక వృత్తితో అనుసంధానంగా చిన్నచిన్న పనులు చేసుకునే 32 వెనుకబడిన కులాల వారు సంచార జీవులుగా ఉన్నారు. వారి కోసం అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అత్యంత వెనుకబడిన కులాల కార్పొరేషన్ (ఎంబీసీ)ని ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిధుల విడుదలను నిలిపివేసింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరికి ఆధార్, రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంది. వీరిలో అత్యంత వెనుకబడిన వారిని ఆర్థికంగా, సామాజికపరంగా వృద్ధిలోకి తీసుకురావాలని చంద్రబాబు ప్రయత్నించారు. ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించేందుకు ప్రయత్నించారు. ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చి వీటన్నింటినీ నిలిపివేసింది. దీంతో సంక్షేమ పథకాలు వీరికి అందని ద్రాక్షగా మిగిలాయి.

చేయూత కోసం..

బీసీ-ఎ కేటగిరిలో ఉన్న ఈ కులాలు చాలా వెనుకబడి ఉన్నాయని... వారు నివసిస్తున్న ప్రాంతాల్లో చాలావరకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరడం లేదని టీడీపీ ప్రభుత్వం గుర్తించగలిగింది. వారికి ఆర్థికంగా చేయూతనందిస్తే స్వయం ఉపాధి సాధిస్తారని భావించింది. అందుకే అత్యంత వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేషన్‌ను రద్దు చేసింది. ఆ తరువాత ఐదేళ్లూ వారిపై దృష్టి పెట్టలేదు. కూటమి ప్రభుత్వం మరోసారి వారిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పథకాలు అందడం లేదు

గాడిద పాలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. మాకు ప్రభుత్వ పథకాలు అందవు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేవు. బ్యాంకు అకౌంట్లు లేవు. ఎప్పుడు ఎక్కడ ఉంటామో తెలియదు. ఆదాయం వచ్చిన రోజు నిత్యావసరాలు కొనుగోలు చేసి వండుకుంటాం. లేకుంటే యాచించి కడుపు నింపుకుంటాం.

-చంద్రావత్ నాయక్, సంచార జీవి

ఆదరణ తగ్గింది..

గంగిరెద్దులను ఆడించడం ఇప్పుడు చాలా కష్టం. వీటికి ఆదరణ తగ్గింది. గంగిరెద్దుల పోషణ కూడా కష్టంగా మారింది. సంక్రాంతి సమయంలో మాత్రమే కాస్త గిట్టుబాటు అవుతుంది. మిగతా సమయాల్లో యాచన చేయక తప్పదు. ప్రభుత్వాలు స్పందించి మాలాంటి వారిని ఆదుకోవాలి.

-యరకయ్య, గంగిరెద్దుల కులస్థుడు

కళ్లికోటలో ఏనుగుల గుంపు

కొమరాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కొమరాడ గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరించిన ఏనుగుల గుంపు శనివారం కళ్లికోట, గారవలస గ్రామాల పరిధిలోకి చేరుకున్నాయి. వరి, కాలీఫ్లవర్ పంటలను ఇవి నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది సూచిస్తున్నారు.



పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

భుక్తి కోసం.. భక్తి మార్గం

గరుగుబిల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భక్తిభావాన్ని చాటుతూ కొందరు... చిన్న చిన్న గృహావసర వస్తువులు తయారు చేస్తూ కొందరు... పొట్ట కూటి కోసం సంచార జీవులుగా బతుకుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ.. కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సంచార జాతుల వారు. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా నాంగోలుకు చెందిన సంచార కుటుంబాలు భక్తి మార్గంలో పయనిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాయి. దేవుళ్ల విగ్రహాలను వాహనాల్లో తిప్పుతూ దాతలు ఇచ్చే కాస్తో కూస్తో ఆర్థిక సాయంతో బతుకు బండి లాగిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లా సువాస్‌కు చెందిన కొన్ని కుటుంబాల వారు బట్టలు ఉతికే సర్ఫ్‌ను తయారు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ఖాళీ ప్రదేశాల్లో గుడారాలు వేసుకుని.. ఊరూరా తిరుగుతూ జీవనం సాగిస్తున్నారు. తమ ప్రాంతాల్లో అవసరమైన స్థలాలు, గృహాలతో పాటు ప్రభుత్వ పథకాలు అందడం లేదని... అందుకే ఇలా సంచార జీవులుగా బతుకుతున్నామని చెబుతున్నారు. ఏడాదిలో 11 నెలలకు పైగా గ్రామాలు, పట్టణాల్లో సంచరిస్తున్నామని తెలిపారు. తమ పిల్లలకు విద్యను అందించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉల్లిభద్ర సమీపంలో గుడారాలు వేసుకున్న సంచార జాతుల వారు



విగ్రహాలతో ఏర్పాటు చేసిన వాహనం

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్‌ను ఎస్‌.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విశాఖపట్నంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సాయం అందించాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

● భోగాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ శుక్రవారం రాత్రి విశాఖలో కలిశారు. మండల అధ్యక్షుడిగా 16 సార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని, తమకు టీడీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగిస్తే పార్టీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని లోకేశ్‌కు తెలిపారు.

పట్టుదలతో చదవండి

చీపురుపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదవాలని, అపుడే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించగలరని ఉన్నత విద్యాశాఖ ఆర్‌జేడీ మజ్జి ఆదినారాయణ సూచించారు. చీపురుపల్లి జీవీఆర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను ఆయన శనివారం సందర్శించారు. లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట కళాశాల సిబ్బంది ఉన్నారు.

చెరువు గట్టుపై కూరుకుపోయిన లారీ

ఎస్‌.కోట రూరల్‌, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వీరనారాయణంనాయుడు చెరువు గట్టుపై శనివారం సాయంత్రం ఒక లారీ కూరుకుపోయింది. వేపాడ మండలం గదబ గ్రామంలో చేపడుతున్న రోడ్డు పనుల నిమిత్తం అధిక లోడుతో వెళ్తున్న లారీ ఈ చెరువు గట్టుపైకి వచ్చేసరికి కూరుకుపోయింది. దీంతో చెరువు గట్టు దెబ్బతిన్నది. మదుములు పాడయ్యాయి. కాంట్రాక్టర్‌ వెంటనే చెరువు గట్టుతోపాటు మదుములను బాగు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

డిజిటల్‌ అసిస్టెంట్‌పై విచారణ

గుర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నాగళ్లవలస డిజిటల్‌ అసిస్టెంట్‌ రెల్లి శ్రీపతిపై ఈవోపీఆర్డీ అన్నపూర్ణాదేవి శనివారం విచారణ జరిపారు. పంచాయతీలో విధులు సక్రమంగా చేయడంలేదని డీఏ రెల్లి శ్రీపతిని రెండు రోజుల కిందట గ్రామ కార్యదర్శి కళ్యాణి అడిగారు. దీంతో ఆయన ఆమెపై దురుసుగా ప్రవర్తించారు. ఆమె బాధపడుతూ ఎంపీడీవో రవికుమార్‌కు, ఎస్‌ఐ నారాయణరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈవోపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి శనివారం నాగళ్లవలస సచివాలయంలో ఉద్యోగులను విచారించారు. ఇద్దరిపై కూడా సమగ్ర విచారణ నిర్వహించారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

వసంత్‌విహార్‌లో పూజలు



కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

కొత్తవలస, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ వసంత విహార్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కుంకుమార్చన నిర్వహించారు. అలాగే శనివారం ఉదయం ప్రముఖ పారిశ్రామికవేత్త వల్లూరి జయప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. వేదపండితుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మద్యం సీసాల స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టిక్కబాయిలో కురుపాం ప్రొహిబిషన్‌ ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మద్యం అక్రమ రవాణాపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, సీజ్‌ చేశారు.

ట్యాంకర్‌ బోల్తా

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి ఒడిశాలోని మునిగూడ వెళ్తున్న ట్యాంకర్‌ గుమ్మలక్ష్మీపురం మండలంలోని మండ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ట్యాంకర్‌లో నిల్వ ఉన్న యాసిడ్‌ లీక్‌ కావడంతో అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ఇక్కడ ఎటువంటి ప్రమాదం లేదని పోలీసులు చెబుతున్నారు.

యువతి అదృశ్యం

లక్కవరపుకోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఖాసాపేట పంచాయతీ శివారు వేచలపువానిపాలెం గ్రామానికి చెందిన వేచలపు మౌనిక (24) కనిపించడం లేదని తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. తన కూతురు డిగ్రీ చదువుకుని ఇంటివద్దే ఉంటుందని, శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల బంధువులను ఆరా తీసినా ఫలితం కానరాలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

ఎంపీడీవోగా సూర్యనారాయణ

వేపాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వేపాడ ఎంపీడీవోగా సీహెచ్‌ సూర్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు పదోన్నతిపై ఎంపీడీవో పదవి రావడంతో నెల రోజుల పాటు శిక్షణ నిమిత్తం సామర్లకోట వెళ్లారు. ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న కె.రవికుమార్‌కు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. శిక్షణ పూర్తి చేసుకున్న సూర్యనారాయణ శనివారం తిరిగి వచ్చి, ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

పల్లెల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

● మంత్రి శ్రీనివాస్‌

బొండపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్‌, ఎన్‌ఆర్‌ఐ సాధికార సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ అన్నారు. మండలంలోని బొండపల్లి-1, అంబటివలస సచివాలయ భవనాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజా సంక్షేమం, ప్రభుత్వ పథకాలపై వివరించారు. బోగస్‌ పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, ఈ విషయం ప్రజలు గుర్తెరిగి అవగాహన పొందాలని సూచించారు. రాష్ట్రంలో 63 లక్షల 71 వేల మందికి పలు రకాల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌

అనంతరం అంబటివలస లో భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలో జీడిపిక్కల ప్రోసెసింగ్‌ ప్రాజెక్టు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని అన్నారు. పారిశ్రామిక వాడ అభివృద్ధికి 50 ఎకరాల స్థల సేకరించారని, ఈ పరిశ్రమల ద్వారా సుమారు వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వీవీవీ.గోపాలరాజు, కోరాడ కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు రాపాక అచ్చంనాయుడు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ముంజేటి పార్వతి, బొండపల్లి, గొట్లాం పీఏసీఎస్‌ అధ్యక్షులు బుద్ధరాజు బుచ్చిరాజు, సిడగాం శ్రీనివాస్‌, తహసీల్దార్‌ డోలా రాజేశ్వరరావు, ఇన్‌చార్జ్‌ ఎంపీడీవో రఘుపతి రావులతోపాటు పలు గ్రామాల సర్పంచ్‌లు నంబూరి రాజేష్‌, ఈదుబిల్లి కృష్ణ, బొండపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా సర్వే చేయండి

● రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ కమిషనర్‌ కృష్ణతేజ
● విజయనగరం జిల్లాలో పర్యటన

బొబ్బిలి రూరల్‌, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తప్పుల్లేకుండా స్వామిత్వ సర్వే చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్‌ కృష్ణతేజ సూచించారు. మెట్టవలస గ్రామ సచివాలయాన్ని ఆయన బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనతో కలిసి శనివారం పరిశీలించారు. స్వామిత్వ సర్వే ప్రక్రియ, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత, క్లోరినేషన్‌, ఐవీఆర్‌ కాల్స్‌పై తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం జగన్నాథపురం సచివాలయాన్ని పరిశీలించారు. మొదటి అంతస్థులో డీడీవో కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అక్టోబరు రెండో తేదీకి కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు. డీడీవో ఎం.కిరణ్‌కుమార్‌, ఎంపీడీవో పి.రవికుమార్‌, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు పాల్గొన్నారు. ● గ్రీన్‌ అంబాసిడర్ల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు ఎ.సురేష్‌.. కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ● తెర్లాం: ఎం.ఆర్‌.అగ్రహారం సచివాలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్‌ కమిషనర్‌ కృష్ణ తేజ శనివారం తనిఖీచేశారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అడిగి



బొబ్బిలి రూరల్‌: మెట్టవలసలో ఎమ్మెల్యే బేబీనాయనతో కలిసి అధికారులతో మాట్లాడుతున్న కృష్ణతేజ

తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాంబాబు ఉన్నారు. ● బొబ్బిలి: బొబ్బిలి కోటను రాష్ట్ర పంచాయతీ రాజ్‌ కమిషనర్‌ కృష్ణతేజ పరిశీలించారు. మ్యూజియంలోని బొబ్బిలి ఆఖరి సంస్థానాధీశుని స్వర్ణ, వెండి సింహాసనాలు, ఆయుధాలు తదితర సామగ్రిని, బొబ్బిలి యుద్ధంలో ఆనాటి వీరులు ఉపయోగించిన ఆయుధాలను పరిశీలించారు. బొబ్బిలి రాజ వంశ చరిత్రను ఎమ్మెల్యే బేబీనాయన ఆయనకు వివరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గజపతినగరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీల ద్వారా అందించే సేవలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌ కమిషనర్‌ కృష్ణతేజ్‌ అన్నారు. గజపతినగరం పంచాయతీ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఇంటి పన్నులకు సంబంధించి ఆన్‌లైన్‌ ప్రక్రియ ఏవిధంగా చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. స్వామిత్వ సర్వే ప్రక్రియపై ఆరా తీశారు. సీఈవో సత్యనారాయణ, విజయనగరం డీఎల్‌పీవో శిరీషరాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో పుష్పలత, ఈవోపీఆర్డీ సుగుణాకరావు తదితరులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం, మూడో నెంబరు సచివాలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్‌ కమిషనర్‌ కృష్ణతేజ శనివారం సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. డీఎల్‌డీవో ఎస్‌.హేమసుందర్‌, ఎంపీడీవో ఐ.సురేష్‌ తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యతో మంచి భవిష్యత్తు

● ఎస్పీ వకుల్‌ జిందాల్‌



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎస్పీ

విజయనగరం క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎస్పీ వకుల్‌ జిందాల్‌ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఏఎస్పీ సౌమ్యలత, వెల్ఫేర్‌ ఆర్‌ఐ గోపాలనాయుడు, పోలీసు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీతో పోస్టుల భర్తీ



మాట్లాడుతున్న ఏఎంవో కృష్ణవేణి

గజపతినగరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ఉన్న ఖాళీలను మెగా డీఎస్సీతో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తుందని రాష్ట్ర ఆదర్శ పాఠశాలల విభాగం కమిషనర్‌ ఏఎంవో కె.కృష్ణవేణి తెలిపారు. మరుపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదర్శ పాఠశాల ల్లో సెప్టెంబరు 1 నుంచి రోజూ ఇంటర్‌మీడియట్‌ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రానున్న ఏడాదిలో జరిగే నీట్‌, ఎంసెట్‌ పరీక్షల్లో రాష్ట్రంలో తొలి వంద ర్యాంకులు ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు రావాలన్నదే లక్ష్యంగా ఈ చర్యలు తీసు కుంటున్నట్టు తెలిపారు. 164 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయని ప్రతి పాఠశాలలో విద్యాశక్తి పథకం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్‌ గెద్ద ఈశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయరూ..

మెరకముడిదాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయాలని రామయ్యవలస పంచాయతీ పాండ్రంకిపేట గ్రామస్థులు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును కోరారు. ఈ మేరకు శనివారం ఆయన్ని కలిసి, వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని వ్యవసాయ పంటలకు సంబంధించి ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌ ఉండడంతో విద్యుత్‌ లోవోల్టేజీ సమస్య తీవ్ర ఇబ్బందికరంగా మారిందని తెలిపారు.

బీసీ హాస్టళ్లలో ఖాళీలు

● అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎస్‌.కోట నియోజకవర్గంలోని ఐదు బీసీ వెల్ఫేర్‌ హాస్టళ్లలో వందల సీట్లు ఖాళీగా ఉండడంపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె నియోజకవర్గ హాస్టళ్ల అడ్వజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. సీట్ల ఖాళీపై ముందుగా సరైన సమాచారం ఇస్తే చాలామంది విద్యార్థులకు అవకాశం కల్పించే వారమని బీసీ వెల్ఫేర్‌ అధికారి ఎస్‌.కృష్ణపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌.కోటలో రెండు పోస్టుమెట్రిక్‌, ఒక ప్రీమెట్రిక్‌ హాస్టళ్లు ఉన్నాయని, ధర్మవరంలో ఒక హాస్టల్‌ ఉందని వెల్ఫేర్‌ అధికారి తెలిపారు. ఒక్కో హాస్టల్‌లో వంద సీట్లుకు గాను మొత్తం 200 సీట్లలో 182 ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే కొత్తవలస బాలికల హాస్టల్‌లో 36 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా విద్యార్థుల కాస్మొటిక్‌ చార్జీలు 75 శాతం హాజరున్న విద్యార్థులకు మూడు నెలల సొమ్మును విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. ఉన్న ఖాళీలను పాఠశాల, ఇంటర్‌, ఐటీఐ, డిప్లమో, ఇంజనీరింగ్‌, డిగ్రీ విద్యార్థులతో భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. హాస్టళ్ల మైనర్‌ మరమ్మతులకు ఆయా శాఖల నుంచి నిధులు ఇప్పించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మీడియాకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని వెల్ఫేర్‌ అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఖాళీలపై ఎప్పటికప్పుడు సమాచారం ఉంటే ఇంత పరిస్థితి వచ్చేది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఎస్‌.అప్పారావు, హాస్టళ్ల వెల్ఫేర్‌ అధికారులు సంగీత, సురేష్‌, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో చేసిన అభివృద్ధిని చూపండి

రాజాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రలో చేసిన అభివృద్ధిని చూపించ గలరా.. అని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు టీడీపీ పొలిట్‌ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌ సవాల్‌ విసిరారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభు త్వం వచ్చిన తర్వాత ఉత్తరాంధ్రలో ఎన్ని పనులు చేపట్టామనేది చూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

పదవులు చేపట్టిన మీరు ఏమి అభివృద్ధి చేశారో చూపించగలరా.. అని సవాల్‌ విసిరారు. ప్రజా ధనాన్ని దోచుకోవడానికి కాలం గడిపారే తప్ప ప్రజల అవసరాలు తీర్చేందుకు ఆలోచన చేయలేదని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్‌ ప్లాంట్‌ విషయంలో ఎటువంటి అభివృద్ధి చేయని తమకు మాట్లాడే హక్కు లేదని బదులిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.13వేల కోట్లు పేకేజీ తెచ్చిన సంగతి తెలిసి ఉంటుందన్నారు. స్కామ్‌ల ప్రభుత్వానికి, పనిచేసే ప్రభుత్వానికి తేడా తెలుసుకోవాలన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

డెంకాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని ఏపీ మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్‌ కిమిడి నాగార్జున అన్నారు. పెదతాడివాడ గ్రామంలో ఉన్న పీబీఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో శనివారం స్త్రీశక్తి మహిళా సాధికారత విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో వారు పాల్గొని, మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే స్త్రీశక్తి పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎండి నజీర్‌, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్‌, పార్లమెంట్‌ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి,



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ బంగార్రాజు

ఏఎంసీ చైర్‌పర్సన్‌ గేదెల గాయత్రి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాదరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ బూర్లె శ్రీధర్‌, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకరరావు, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, పతివాడ విద్యాసాగర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధి కోసం ఎంవోయూ

విజయనగరం టౌన్‌, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ రీసెర్చ్‌ (ఐసీఏఆర్‌) ఆధ్వర్యంలో ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ రైస్‌ రీసెర్చ్‌ (ఐఐఆర్‌ఆర్‌) హైదరాబాద్‌, సెంట్రల్‌ ట్రైబల్‌ యూనివర్సిటీ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌ (సీటీయూ ఏపీ) మధ్య గిరిజనాభివృద్ధి కోసం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఐఐఆర్‌ఆర్‌ డైరెక్టర్‌ డా.ఆర్‌ఎం.సుందరం అధ్యక్షతన హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఈ సమావేశంలో ప్రముఖ శాస్త్రవేత్తలు డా.సీఎన్‌.నీరజ, డా.అమ్‌తుల్‌ వారిస్‌, డా.ఎపీ.పద్మకుమారి, డా.బి.శ్రీదేవి, డా.పాపారావు వైకుంఠపు పాల్గొన్నారు. సెంట్రల్‌ ట్రైబల్‌ యూనివర్సిటీ తరఫున ఆఫీసియేటింగ్‌ వైస్‌ చాన్సలర్‌ ప్రొఫెసర్‌ టి.శ్రీనివాసన్‌, అసోషియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అనిరుద్‌ కుమార్‌ పాల్గొన్నారు.

చర్చించిన అంశాలు

గిరిజన ప్రాంతాల్లో సేంద్రియ వరిసాగు ప్రోత్సాహం, ఇనుము, జింక్‌ అధికంగా ఉన్న వరి రకాల సాగు ద్వారా రక్తహీనత నివారణ, తక్కువ జీఎల్‌ రైస్‌ రకాల ద్వారా డయాబిటీస్‌ నియంత్రణ, గిరిజన రైతులకు ఆధునిక వరి సాగు సాంకేతికతలపై శిక్షణ, బయోఫోర్టిఫైడ్‌ వరి విత్తనాల పంపిణీ, సాగులో ప్రోత్సాహం. మట్టి పరీక్ష, పురుగుమందు ఉచ్చులు, వ్యాధుల నియం త్రణపై శిక్షణ. ఏఐసీఆర్‌ సీపీ ప్రాజెక్టులో సీటీయూ ఏపీని వలంటరీ సెంటర్‌గా గుర్తింపు. ట్రైబల్‌ సబ్‌ ప్లాన్‌ (టీఎస్‌పీ) ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధి.

● అవగాహనా ఒప్పందంపై సీటీయూఏపీ తరఫున ప్రొఫెసర్‌ టి.శ్రీనివాసన్‌, ఐఐఆర్‌ఆర్‌ తరఫున డాక్టర్‌ ఆర్‌ఎం.సుందరం సంతకాలు చేశారు. భాగస్వామ్యం ద్వారా గిరిజన సమాజానికి స్థిరమైన వ్యవసాయాభివృద్ధి, పోషక భద్రత, ఆర్థిక-సామాజిక పురోగతి సాధించడమే లక్ష్యమని ఇరు సంస్థలు ప్రకటించాయి.

జిందాల్‌ నిర్వాసితుల అర్ధనగ్న ప్రదర్శన

ఎస్‌.కోట రూరల్‌, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర గ్రామంలో గత 69 రోజులుగా జిందాల్‌ నిర్వాసితులు నిరసన చేస్తున్నారు. జిందాల్‌ యాజమాన్యం తమకు ఇవ్వాల్సిన అన్ని పరిహారాలు వెంటనే అందించాలని, లేదంటే తమ భూములను జీవో నెంబర్‌ 2013 ప్రకారం వెనక్కి ఇవ్వాలని డిమాండ్‌ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్‌ ఆధ్వర్యంలో వారు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. జిందాల్‌కు ఇచ్చిన అన్ని అనుమతులు ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు.

బాధిత గ్రామాల్లో పర్యటించండి

జిందాల్‌ బాధిత గ్రామాల్లో పర్యటించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ శనివారం స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ మురళీ కలిసి, వినతిపత్రం అందించారు. ఈ పర్యటనలో జిందాల్‌



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న జిందాల్‌ నిర్వాసితులు

భూ కేటాయింపుల్లో జరిగిన మోసాలపై విచారణ చేపట్టాలని కోరారు.

చేపలవేటకు వెళ్లి ఒకరి గల్లంతు

పార్వతీపురం రూరల్‌, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌.ములగ గ్రామానికి చెందిన పాడి బంగారిదొర(45) చేపలవేటకు వెళ్లి శనివారం గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. వెలగవలస గ్రామ సమీపంలో ఉన్న చెరువులో చేపలవేటకు నలుగురు వెళ్లారు. వీరిలో బంగారి దొర గల్లంతయ్యారు. ఈ సంఘటన జరిగిన వెంటనే తెలుసుకున్న రూరల్‌ ఎస్‌ఐ సంతోషి సిబ్బందితో కలిసి చెరువు వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి 7.45 గంటల నిమిషాల వరకు మృతదేహం లభ్యం కాలేదు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు మడక విశ్వనాధం గ్రామ పెద్దలు భీమవరపు సూర్యనారాయణ తదితరులు పోలీసులకు సహకరిస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మక్కువ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దేవర శిర్లాం పంచాయతీ లోవరకండిలో జరిగిన హత్యకేసులో నిందితుడిని పోలీసులు అరెస్టుచేశారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.వెంకట రమణమూర్తి, పోలీస్‌ సిబ్బందితో కలిసి సాలూరు సీఐ పి.రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. లోవరకండికి చెందిన సాగరపు శివందొర అలియాస్‌ అది పెయింటింగ్‌ వర్క్‌లు చేస్తుంటాడు. ఆయనకు భార్య హేమలతతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇదే గ్రామంలో ఉంటున్న సాగరపు దాళందొర భార్య దమయంతికి ఇద్దరు కుమారులు వెంకటరమణ, కార్తీక్‌ ఉన్నారు. శివమ్‌దొరకు మొక్కలు, బీరకాయ పాదులు పెంచుతున్నాడు. అందులోకి నాలుగు రోజుల నుంచి ఆవులు వెళ్తున్నాయని రోజూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 28న దమయంతి మేనళ్లుడు కిషోర్‌, మహేష్‌ పార్వతీపురం మండలంలోని జగన్నాథపురం నుంచి లోవరకండికి వినాయక చవితి ఉత్సవాలకు వచ్చారు. వాలీబాల్‌ ఆడడానికి వెళ్లడంతో శివందొర అక్కడకు వెళ్లాడు. తనతో వాలీబాల్‌ ఆడుకుంటే అందర్నీ చక్కెరగుత్తితో పొడుస్తానని బెదిరించాడు. ఆ సమయంలో పెనుగులాటలో శివందొరకు స్వల్పగాయం కావడంతో భార్య హేమలత వీధివాసులను తిట్టడంతో తగాదా ప్రారంభమైంది. విషయం తెలుసుకున్న శివందొర దమయంతి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశాడు. గొడవను ఆపే క్రమంలో కార్తీక్‌ను చక్కర గుత్తితో పొడిచాడు. దీంతో కార్తీక్‌కు బలమైన గాయాలయ్యాయి. వెంటనే పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కార్తీక్‌ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ముద్దాయిని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి వెళుతూ..

● రోడ్డు ప్రమాదం ● యువకుడికి బ్రెయిన్‌ డెడ్‌

ఎచ్చెర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల సమీపంలో పాత జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరఘట్టం మండలం గదబవలసకి చెందిన చిలకల శేఖర్‌(25) తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. ఎస్‌ఐ వి.సందీప్‌ కుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బీపీఈడీ పూర్తి చేసిన శేఖర్‌ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ యూనివర్సిటీలో సర్టిఫికెట్లు తీసుకుని మోటారు బైక్‌పై తిరిగి వెళ్తుండగా ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శేఖర్‌ను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా వైద్యులు బ్రెయిన్‌ డెడ్‌ అయినట్టు గుర్తించారు. కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకు రావడంతో క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉంచారు. బీపీఈడీ పూర్తిచేసి గుంటూరులో ఎంపీఈడీ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు సిద్ధమైన శేఖర్‌కు ఇలా ప్రమాదానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు.

వివాహిత ఆత్మహత్య

నెల్లిమర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ బి.గణేష్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగిరాజుపేట గ్రామానికి చెందిన లెంక లావణ్య(25) గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నొప్పి తాళలేక శుక్రవారం చీమల మందు తాగింది. అపస్మారక స్థితికి వెళ్లిన ఆమెను కుటుంబ సభ్యులు నెల్లిమర్ల మిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం దల్లివలసకు చెందిన కిల్లాన లావణ్యకు నెల్లిమర్ల మండలం జోగిరాజుపేట గ్రామానికి చెందిన లెంక జనార్ధనరావుతో 2017లో వివాహమైంది. తహసీల్దార్‌ కె.శ్రీకాంత్‌ పర్యవేక్షణలో శనివారం లావణ్య మృతదేహానికి పంచనామా నిర్వహించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

యువకుడి మృతదేహం లభ్యం

పాచిపెంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్‌లో పడి గల్లంతైన గిరిజన యువకుడు మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. ఈనెల 27న పెద్దగెడ్డ జలాశయంలో కోడికాళ్లవలసకు చెందిన జన్ని బాలరాజు చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి గల్లంతైన విషయం విదితమే. బాలరాజు మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ కె.వెంకటసురేష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పిడుగు పడి మహిళ మృతి

లక్కవరపుకోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గేదెలవానిపాలెం శివారు వేచలపు వానిపాలెం గ్రామానికి చెందిన నెక్కల ఈశ్వరమ్మ(36) అనే మహిళ శనివారం పిడుగుపాటుకు గురై మృతిచెందింది. పిడుగు పాటుకు గురైన వెంటనే ఆమెను ఎస్‌.కోట కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని ఆమె భర్త రాంబాబు తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● బస్సు సీటు కోసం కొట్లాటపై పోలీసులకు ఫిర్యాదులు

బొబ్బిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు సీటు కోసం ఇద్దరు వ్యక్తులు కొట్లాడుకున్న ఘటనపై టీడీపీ సీనియర్‌ నేత అల్లాడ భాస్కరరావు, పార్వతీపురం డిపో అధికారి.. బొబ్బిలి పోలీసులకు శనివారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి అప్రతిష్ట తెచ్చేందుకు కొంతమంది ఉద్దేశపూర్వకంగా ప్రయాణికుల మధ్య జరిగిన ఘర్షణను వీడియో తీసి వైరల్‌ చేశారని, ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల్లో వారు పేర్కొన్నారు. సీటు కోసం గొడవపడిన మహిళది బొబ్బిలి పట్టణంలోని మల్లమ్మపేట కాగా, పురుషుడిది కురుపాం ప్రాంతంగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదులు అందిన మాట వాస్తవమేనని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ సతీష్‌కుమార్‌ తెలిపారు.

నిధులు మంజూరుకాక.. నిర్మాణం జరగక


బురదమయమైన తోటవలస మట్టిరోడ్డు

● ఏటా వర్షాకాలంలో బురదలోనే రాకపోకలు ● ఇదీ తోటవలస నుంచి శంబర రోడ్డు దుస్థితి

మక్కువరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్యాసిరాజపురం పంచాయతీ పరిధిలోగల తోటవలస నుంచి శంబర వెళ్లే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకాకపోవడంతో ప్రజలకు అగచాట్లు తప్పడంలేదు. తోటవలస నుంచి శంబర తారురోడ్డు జంక్షన్ వరకు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి దశాబ్దాలుగా మోక్షం లభించడంలేదు. దీంతో తోటవలస ప్రజలు ఏళ్ల గడుస్తున్నా మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగించవలసి వస్తోంది. ఏటా వర్షాకాలం ప్రారంభం నుంచి నాలుగునెలలపాటు బురదరోడ్డుపైనే గ్రామానికి చేరుకోవల్సివస్తోంది. తోటవలస నుంచి శంబర తారురోడ్డు జంక్షన్ వరకుగల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు కోటశివున్నాయుడు, వంగపండు అప్పలనాయుడు తెలిపారు.ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశామని చెప్పారు.కాగావైసీపీ హయాంలో బీటీరోడ్డుకు కోటి12 లక్షలు మంజూరుచేసినా, నిధులులేక రద్దైనట్లు పీఆర్ ఏఈ జి.శంకరరావు తెలిపారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు చేయండి

●సాలూరు మునిసిపల్ పాలకవర్గం డిమాండ్

సాలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):మూలకుచేరిన మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని మునిసిపల్ పాలకవర్గ సభ్యులు డిమాండ్‌చేశారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది.తొలుత అధికారులు సమావేశ అజెండాను చదివి వినిపించారు. మునిసిపాలిటీకి ఆనుకొని ఉన్న నేషనల్ హైవేలో విద్యుత్ దీపాలు బిగించాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో మూడు రోడ్ల కూడలి నుంచి రోడ్డుపై లైట్లు బిగించేందుకు రూ.3.50లక్షలతో ప్రతిపాదించారు. ప్రతిపాదనలు ఆమోదించిన అనంతరం పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ మునిసిపాలిటీలో సగానికిపైగా సామూహిక మరుగుదొడ్లు మూలకు చేరాయని తెలిపారు. వైసీపీ కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గిరి రఘు, వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి తీసుకొచ్చిన రూ.రెండు కోట్ల నిధులపై ప్రశ్నించారు. దీంతో డీఈ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని తెలిపారు. పనులుచేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులుచెల్లిస్తే ఎందుకు ముందుకు రారని వైసీపీ కౌన్సిలర్ బలభద్రుని శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలో ఏర్పాటుచేస్తున్న వందపడకల ఆసుపత్రికి సంబంధించి రింగురోడ్డు, సీసీ రోడ్డు నిర్మించాలని మంత్రి ఆదేశించడంతో అధికారులు అజెండాలో చేర్పించి వివరించారు.అయితే కౌన్సిలర్లు మాధవరావు, గిరి రఘులు మాట్లాడుతూ వందపడకల ఆసుపత్రికి సంబంధించి రూ.30 లక్షల మునిసిపాలిటీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడం సరికాదని, ఇప్పటికే ఖజానాలో డబ్బులు లేక ఇబ్బందిపడుతున్నామని పేర్కొన్నారు.పట్టణంలో నిత్యం అనేక సమస్యలతో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు.సమావేశంలో కమిషనర్ రత్నకుమార్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పాలకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ జైలు సిబ్బందికి సూచించారు. శనివారం పాలకొండ సబ్‌జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు శామ్యూల్, బొడ్డు రామ్మోహన్‌రావు, ఎ.శివాదాసు, ఎం.వెంకటేశ్వర్లు, జైలుఇన్‌చార్జి రమణయ్య, హెడ్ వార్డర్ బి.విజయకుమార్, హేమసుందర్, బి.నరసింహులు, జీపీటీ నాయుడు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి హరిప్రియ కోరారు. శనివారం స్థానిక కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. కేసుల రాజీ ద్వారా పరిష్కరించుకుంటే కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందని తెలిపారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

పాలకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలని ఏరియాఆసుపత్రి సూపరింటెండెంట్ చిరంజీవి కోరారు. శనివారం పాలకొండ ఏరియా ఆసుపత్రి సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సామాన్యులకోసం నిర్వహిస్తున్న ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం కలిగించడమే లక్ష్యంగా సేవలందిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలోని అత్యవసరమైన జనరల్‌విభాగంలో జనరల్ డాక్టర్‌గా తానుఒక్కరే ఉండడాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఓపీ విభాగంలో అధికంగా జనరల్ పేషెంట్స్ ఉంటున్నారని, మరో జనరల్ వైద్యుడిని నియమించాలని కోరారు. ఆయనతో పాటు డాక్టర్ సుఖేష్ పాల్గొన్నారు.

కుటుంబంలో మహిళలదే కీలక పాత్ర

పాచిపెంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబం అభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని కృషివిజ్ఞాన కేంద్రం, రస్తాకుంటుబాయి గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి తెలిపారు.శనివారం స్థానికవ్యవసాయ కార్యాలయంలో గిరిజన మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతపండు బ్లాక్‌ల తయారీ, తేనెటీగల పెంపకం, అటవీ ఉత్పత్తుల విలువలు జోడింపు, తదితర వాటిపై గిరిజన మహిళలకు ఉచితంగా శిక్షణఇస్తామని, శిక్షణ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సదస్సులో ఏవో కె.తిరుపతిరావు, సతాబి సర్పంచ్ రామయ్య పాల్గొన్నారు.

మత్స్యకారులకు పరికరాలు అందించాలి

పాచిపెంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అవసరమైన పరికరాలు అందించాలని ఎంపీపీ బడ్నాన ప్రమీల కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బోట్లు, సేఫ్టీ జాకెట్లు, వలలు అందించాలన్నారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం

సీతానగరం, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి):తామరఖండి శివాలయం యూత్, హడ్కో కాలనీ, గాదెలవలస, ఆర్.వెంకంపేటల్లో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు శనివారం జరిగాయి. ఈసందర్భంగా ఆర్.వెంకంపేటలో రైజింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆటలు,పాటల పోటీలు నిర్వహించి సర్పంచ్ పెంట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీచేశారు. తామరఖండి శివాలయం యూత్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవం జరి గింది. హడ్కో కాలనీవాసులు బొజ్జ గణపయ్య లీలపై వ్యాస రచన, పాటల పోటీలు నిర్వహించి ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

విద్యా ప్రమాణాలను పర్యవేక్షించాలి

పార్వతీపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఎప్పటిప్పుడు పర్యవేక్షించాలని మానటరింగ్ ఆఫీసర్ శశిభూషణ్ కోరారు. శనివారం మండలంలోని నర్సిపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్య క్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బి.సత్యనారాయణ, ఆర్పీలు బి.నారాయణ, బి.చం ద్రశేఖర్, బాలకృష్ణ, సిఆర్‌ఎంటి అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి కోసం ప్రణాళిక

సీతానగరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతి కోసం కార్యాచరణ రూపొందించడానికి సమాయత్తం కావాలని ఎంఈవో జి.సూరిదేముడు తెలిపనారు మండలంలోని బూర్జ, గాదెలవలస, సీతానగరం ఉన్నత పాఠశాలల్లో శనివారం హెచ్‌ఎంల అధ్యక్షతన క్లస్టర్ స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా గాదెలవలస క్లస్టర్ సమావేశంలో ఎంఈవో సూరిదేముడు ఎఫ్ఏ-1 పరీక్షలు, సి, డి గ్రేడ్‌ల విభజన అంశాలు, సిలబస్ పూర్తి చేయడం, టీచర్ హ్యాండ్ బుక్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

నత్తల నివారణ చర్యలపై అవగాహన

కొమరాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగరేగువలస గ్రామ రైతు కందులాటి సాయిబాబాబు పొలంలో నత్తల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పార్వతీపురంలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులకు రైతులకు ఉద్యానవన అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త అమృతవీణ, మండల హార్టికల్చర్ ఆఫీసర్ గిరిజన రైతులు పాల్గొన్నారు.

శంబర జడ్పీ ఉన్నతపాఠశాలలో వేదిక ఏర్పాటు

మక్కువరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ గ్రామానికి చెందిన పోలమాంబ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ నైదాన తిరుపతి, ఆయన కుమారుడు సూర్యయాదవ్ లక్షా 20 వేల రూపాయలతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే వేదిక నిర్మించారు. ఇక్కడ 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో సాంస్కృతికకార్యక్రమాల నిర్వహణకు వేదిక లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారు.ఈనేపథ్యంలో నైదాన తిరుపతి, ఆయన కుమారుడు సూర్యయాద వేదికకు సంబంధించిన షెడ్డును నిర్మించారు. కాగా నైదాన కుటుంబసభ్యులు పాఠశాలకు సొంత డబ్బులతో వేదిక ఏర్పాటుచేయడంపై గామపెద్దలు ఎంపీటీసి తీళ్లపోలినాయుడు, శంబర మాజీ సర్పంచ్ పూడిదాలినాయుడు, పోలమాంబ దేవాలయం మాజీచైర్మన్ గెంజికాశినాయుడుతో పాటు పలువురు అభినందించారు.



పాఠశాల ఆవరణలో వేదిక నిర్మించిన దృశ్యం


కురుపాం: బస్సులో ప్రయాణిస్తున్న జగదీశ్వరి


గరుగుబిల్లి: సంతోషపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

దశలవారీగా సూపర్ సిక్స్ పథకాల అమలు

● ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కురుపాం/గుమ్మలక్ష్మీపురం,ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలుచేస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం కురుపాంలో సూపర్ సిక్స్ సూపర్ పథకాలు, స్త్రీ శక్తి విజయోత్సవాలు నిర్వహించారు. జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం నుంచి కురుపాం వరకు మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. అనంతరం టీడీపీ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా మహిళలతో జగదీశ్వరి ర్యాలీ నిర్వహించారు. స్త్రీ శక్తి , సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. . అనంతరం మహిళలు జగదీశ్వరికి సన్మానించారు.

మహిళలకే మొదటి ప్రాధాన్యత

గరుగుబిల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని అరకు తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం ఉపాధ్యక్షులు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు తెలిపారు. శనివారం సంతోషపురం పంచాయతీ పరిధిలో స్త్రీశక్తి కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యమల శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ ఎ.రామకృష్ణ, ఎం.చందు పాల్గొన్నారు.

ఏదీ పారిశ్రామికీకరుణ?

(5వ పేజీ తరువాయి)

మరోలా ఉంది. ఇప్పటివరకు పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలంలో మాత్రమే ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 27 ఎకరాల్లో సుమారు రూ.7కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. అయితే పార్వతీపురం, సాలూరు, కురుపాం, నియోజకవర్గాల్లో ఇంకా పార్క్‌లకు స్థలాలు ఖరారు కాలేదు. దీనిపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు. మన్యాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి.. స్థానికంగా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాత్రి అయితే రెఫరే!

(5వ పేజీ తరువాయి)

వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొన్ని సందర్భాల్లో నిండు ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.చిరంజీవరావును వివరణ కోరగా.. 'ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. క్రిటికల్‌గా ఉన్న కేసులను మాత్రమే రిఫరల్ చేస్తున్నాం. మరింత నాణ్యమైన వైద్యసేవలందించేందుకు వైద్య సిబ్బందితో కలిసి సమష్టిగా పనిచేస్తాం.' అని తెలిపారు.

వైద్యులు, సిబ్బంది ఇలా..

● స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు జనరల్ ఫిజీషియన్లు అవసరం. ప్రస్తుతం ఇక్కడ రెండు పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. కనీసం ఒక్క వైద్యుడు కూడా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ● ఆసుపత్రిలో రేడియాలజిస్టులు అందుబాటులో లేకపోవడంతో వివిధ రకాల స్కానింగ్‌ల కోసం వచ్చే రోగులకూ అవస్థలు తప్పడం లేదు. ● ఇద్దరు మత్తు వైద్యులు అవసరం కాగా ఇక్కడ ఒక్కరు మాత్రమే ఉన్నారు.● ముగ్గురు గైనకాలజిస్టులకు ఇద్దరు వైద్యులే ఉన్నారు.● సివిల్ సర్జన్ , స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

206 ఫోన్ల రికవరీ

(5వ పేజీ తరువాయి)

పాచిపెంట-6, పాలకొండ-90, పార్వతీపురం రూరల్-5, పార్వతీపురం టౌన్-5, సీతానగరం- 8, నీలకంఠాపురం- 7, వీరఘట్టం-10, జియ్యమ్మవలస-3, చినమేరంగి-3, కొమరాడ-2, గరుగుబిల్లి-3, సాలూరు టౌన్-7, సాలూరు రూరల్-1, మక్కువ-1, బత్తిలి-1, సీతంపేటలో 17 చొప్పున మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. రికవరీలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ థామస్‌రెడ్డి, సీఐలు, సోషల్ మీడియా, సైబర్ సెల్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రమిషన్ డైరెక్టర్‌గా లక్ష్మణరావు


లక్ష్మణరావు

పార్వతీపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలోని జోగంపేటకు చెందిన లక్ష్మణరావు స్వచ్ఛాంధ్రామిషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుతం శనివారం రాత్రి వివిధ కార్పొరేషన్లకు సంబంధించి డైరెక్టర్లను ప్రకటించింది. లక్ష్మణరావు 40 సంవత్సరాలుగా టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు డైరెక్టర్ పదవి రావడం పట్ల పార్టీ నాయకులు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తనను డైరెక్టర్‌గా నియమించడంపై లక్ష్మణరావు ఎమ్మెల్యే విజయచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

నల్లరాయిగూడ వాసులు ఆదర్శంగా ఉండాలి


మాట్లాడుతున్న రాణి

భామిని, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నల్లరాయిగూడ గ్రామస్థులు భవిష్యత్‌లో మరింత ఆదర్శంగా ఉండాలని కొత్తూరు సివిల్ న్యాయాధికారి కె.రాణి సూచించారు. నల్లరాయిగూడలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. వివాదరహిత గ్రామంగా నల్లరాయిగూడ పేరొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ గ్రామాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బత్తిలి ఎస్ఐ జి. అప్పారావు మాట్లాడుతూయువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

కొమరాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని లోక్‌అదాలత్ సభ్యుడు టి.జోగారావు అన్నారు. శనివారం గుమడలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహానికి పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఎంపీ రమణ, రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ, పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

రాయగడ,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాయగడ జడ్పీ ముఖ్యఅభివృద్ధి అధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు శనివారం మునిగుడ సమితిలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మునిఖోల్‌లోని సమితి కార్యాలయాన్ని సందర్శించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాల నిర్మాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు తొందరగా గృహాలు నిర్మించి ఇవ్వాలని అధికారులను అదేశించారు. అనంతరం డెంగుణి గ్రామంలో సంక్షేమ పథకాలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.

వీరఘట్టంలో లక్ష పత్రి పూజ


వీరఘట్టం: లక్షపత్రి పూజ చేస్తున్న భక్తులు

వీరఘట్టం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని కూరాకులవీధిలో శనివారం వినాయక నవరాత్రులు సందర్భంగా శనివారం యజ్ఞకర్త సర్వాజోస్యుల శర్మయాజీ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ నిర్వహించారు.

● గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డులో యూనియన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించి, ఆమె కూడా స్వీకరించారు.

బెంచీలు లేవు.. రన్నింగ్ వాటర్ లేదు

పాచిపెంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యలు తిష్టవేశాయి.దీంతో ప్రయాణికులకు అవస్థలుతప్పడం లేదు. కాంప్లెక్స్‌ను ఆనుకుని నిర్మించిన మరుగుదొడ్లు, బాత్ రూములు రన్నింగ్ వాటర్ లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటి పడిన తర్వాత అమావాస్యను తలపిస్తోంది.కూర్చోవడానికి బెంచీలు, బల్లలు లేకపోవడంతో ప్రయాణికులు నిరీక్షించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు సౌకర్యార్థం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్ నిత్యం మూతపడి ఉంటున్నాయి. తక్షణమే మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టి సౌకర్యాలు మెరుగుకు కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సౌకర్యాలకు నోచుకోని ఆర్టీసీ కాంప్లెక్స్

మరమ్మతులు లేక.. అగచాట్లు తప్పక

●ఇదీ పాచిపెంట -కుంతాం రోడ్డు పరిస్థితి


అధ్వానంగా ఉన్న కుంతాం రోడ్డు

పాచిపెంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట నుంచి కుంతాం వరకు గల సుమారు ఎనిమిది కిలోమీటర్లు రోడ్డు ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఈ రోడ్డు అభివృద్ధి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టిం చుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. దీంతో అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించే గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. పది గిరిజన గ్రామాల ప్రజలతోపాటు ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిత్యం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అడుగడగునా గోతులమయం కావడంతోపాటు రాళ్లు తేలడంతో వాహనాలు అదుపుతప్పడం వల్ల గాయపడుతున్నట్లు ద్విచక్ర వాహనచోదకులు చెబుతున్నారు. 1998 మే ఎనిమిదో తేదీన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుంతాంరోడ్డు జంక్షన్ వరకు వచ్చి గిరి జనులుపడుతున్న అవస్థలను పరిశీలించారు. దీంతో ఆయన తక్షణమే ఆ జంక్షన్ వద్ద మొక్క నాటి కుం తాం గ్రామానికి బీటీరోడ్డు వేయించి బస్సులో వస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు వెంటనే బీటీ రోడ్డు నిర్మించిన విషయం విదితమే. అయితే వర్షాలు, నిర్వహణ లేకపోవడంతో బీటీ రోడ్డు అడుగడుగునా గోతులమయమై రాళ్లు తేలిపోయాయి. ఈ నేపథ్యంలోపాచిపెంట చేరుకోవాలన్నా, ఇక్కడి నుంచి ఆయా స్వగ్రామాలకు వెళ్లాలన్నా గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాచిపెంట నుంచి కుంతాం వరకు గల బీటీ రోడ్డును మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

గొయ్యి పూడ్చేదెన్నోడో..?

వీరఘట్టం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం- సంతనర్సిపురం రహదారిలో వీరఘట్టం రైస్‌మిల్లు సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు చేరుతుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారి మీదుగా వీరఘట్టం నుంచి సంతనర్సిపురం మీదుగా జీఎంవలస మండలానికి నిత్యం వందలాది మంది రాకపోకల సాగిస్తుంటారు. అధికారులు స్పందించి గొయ్యిను పూడ్చి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

కురుపాంలో రక్తదాన శిబిరం

కురుపాం,ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): అన్ని దానాలు కన్నా రక్తదానం చాలా గొప్పదని తహసీల్దార్ కె.జయ తెలిపారు. శనివారం కురుపాంలోని రావాడ కూడలి వద్ద వాయుపుత్ర సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాని రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపతిర బి.సుభాష్, బ్లాడ్ బ్యాంక్ ఎల్‌టీ బి.అనీల్, సంఘ సభ్యులు బోటుఅనీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా సూరిబాబు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా కురుపాం కళాశాలకు చెందిన ఇ.సూరిబాబు నియమితులయ్యారు. ఆయన కురుపాం కళాశాలలో ఒకేషనల్ కామర్స్ జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మ, రామ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేయాలి

గరుగుబిల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులను నిబంధనల మేరకు పంపిణీ చేయాలని డీటీ ఎం.రాజేంద్ర, సీఎస్‌డీటీ ఎస్.మారుతీరావు కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబరు ఆరో తేదీ నుంచి మూడోవిడతలో భాగంగా స్మార్ట్ కార్డులు పంపిణీ జరగనుందని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకు 26 నుంచి 31 వరకు ఇంటింటికి వెళ్లి సరుకులు అందించాలని, ఒకటి నుంచి 15 వరకు దుకాణాల పరిధిలో అందించాలని కోరారు.

ఎరువులు అందించేందుకు చర్యలు

గరుగుబిల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులకు అవసరమైన ఎరువులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఏవో జ్యోత్స్న తెలిపారు. శనివారం గరుగుబిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి 13 రైతుసేవా కేంద్రాలకు ముందుగా 375 మెట్రిక్ టన్నుల యూరియా, 203 మెట్రిక్ టన్నుల డీఏపీను సరఫరా చేసినట్లు తెలిపారు. మండలానికి 1,200 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటికే వెయ్యి మెట్రిక్ టన్నులను అందించామన్నారు.

నీటి తీరువా వసూళ్లపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నీటి తీరువా వసూళ్లపై వీఆర్వోలు దృష్టి సారించాలని తహసీల్దార్ పి.బాల, డీటీ ఎం.రాజేంద్రలు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి తీరువాపై సంబంధిత రైతులకు ముందస్తు నోటీసులు జారీచేయాలని కోరారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

గరుగుబిల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి, గృహ నిర్మాణశాఖ జేఈ వి.అఖిల్ కోరారు. రాయిందొరవలస, సన్యాసిరాజుపేట, పెదగుడబ, చినగుడబ పంచాయతీల్లో గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరారు.